



అరివాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ - మెరీనాబీచ్‌లోని తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి వద్ద మంత్రులు, ఎంపీలతో కలిసి నివాళులర్పిస్తున్న స్టాలిన్

అభిమాన నేతకు అభినందనల వెల్లువ

అట్టహాసంగా స్టాలిన్ జన్మదిన వేడుకలు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 72వ జన్మదిన వేడుకలు క్యాంపు కార్యాలయం, పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం వద్ద అట్టహాసంగా జరిగాయి. శనివారం ఉదయం స్టాలిన్ తన నివాసంలో తండ్రి, మాజీముఖ్యమంత్రి కరుణానిధి చిత్రపటానికి పూలమాలవేశారు. కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. సతీమణి దుర్గాస్టాలిన్, తనయుడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, సోదరి కనిమొళి ఆయనకు కేక్ తినిపించారు. ఆ తర్వాత గోపాలపురంలోని కరుణానిధి నివాసానికి వెళ్ళి మాతృమూర్తి దయాళు అమ్మాళ్ ఆశీస్సులందుకున్నారు. ఆ ఇంటిలో కరుణానిధి చిత్రపటానికి నివాళులర్పించారు. అక్కడి నుండి బయలుదేరి సీఐటీ కాలనీలో ఉన్న సోదరి కనిమొళి నివాసానికి వెళ్ళి కరుణానిధి ద్వితీయ సతీమణి రాజాత్తి అమ్మాళ్ ఆశీస్సులందుకున్నారు. అక్కడి నుంచి మెరీనాబీచ్ చేరుకుని మాజీముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి సమాధులపై మంత్రివర్గ సభ్యులు, పార్టీ ప్రముఖులతో కలిసి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అక్కడి నుండి వేప్పేరికి బయలుదేరి పెరియార్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించారు. ఆ సందర్భంగా ద్రావిడ కళగం నేత కే వీరమణి స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్టాలిన్‌తో పాటు సీనియర్ మంత్రి దురైమురుగన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఐ.పెరియసామి, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, దామో అన్బరసన్, ఈవీ వేలు. టీఆర్‌బీ రాజాఎంఆర్‌కే పన్నీర్ సెల్వం, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియా, ఎంపీలు టీఆర్ బాలు, ఎ. రాజా, దయానిధి మారన్ తదితరులు పాల్గొన్నారు.

అరివాలయంలో...

ఆ తర్వాత అన్నా అరివాలయంకు వెళ్ళి వివిధ జిల్లాల నుండి వచ్చిన పార్టీ ప్రముఖులు, కార్యకర్తల శుభాకాంక్షలు అందుకున్నారు. పార్టీ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. స్పీకర్ అప్పావు, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, కాంగ్రెస్ నేతలు తిరునావుక్కరసర్, ఎం.కృష్ణసామి, సీఎల్పీ నేత రాజేష్, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, సీపీఐ రాష్ట్ర కమిటీ నేత ముత్తరసన్, సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి కే బాలకృష్ణన్, నేషనల్ లీగ్ కార్యదర్శి తిరుప్పూర్ అల్తాఫ్, పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రులు వైద్యలింగం, వి.నారాయణస్వామి, ఎండీఎంకే నేతలు వైగో, దురై వైగో, తమిళగ వాళ్వురిమై కట్చి నేత వేల్‌మురుగన్, ముక్కుళత్తోర్ పులిపడై అధ్యక్షుడు, సినీ నటుడు కరుణాస్ తదితరులు స్టాలిన్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలతో అరివాలయం సందడిగా మారింది. ఉదయం 10 గంటలకు అరివాలయం చేరుకున్న స్టాలిన్‌కు పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత మంత్రులు, కార్యకర్తల చేత స్టాలిన్ ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర హక్కులను ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టమని, రాష్ట్ర సంక్షేమాన్ని, భవిష్యత్తును కాపాడటమే తన ధ్యేయమని, సమైక్యంగా ఉంటూ నీతి, న్యాయకోసం పోరాడుతూనే ఉంటామని స్టాలిన్ తమిళంలో శపథం చేయించారు.

నేతల శుభాకాంక్షలు ...

ముఖ్యమంత్రి స్టాలిన్ 72వ జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, లోక్‌సభ ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ఎల్.మురుగన్ కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ కూడా స్టాలిన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ దీర్ఘాయుస్సుతో సంపూర్ణ ఆరోగ్యంతో తమిళనాడు ప్రజలకు సేవలందించాలని పేర్కొన్నారు. సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో రాజకీయ పరంగా సామాజిక న్యాయం కోసం పోరాడి మరిన్ని విజయాలు సాధించాలని కేరళ సీఎం పినయార్ విజయన్ శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ గాంధీ తన సందేశంలో సా సోదరుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు, దేశ ప్రగతికి, రాజ్యాంగ ధర్మాసనం రక్షణకు మేమిద్దరం కలిసి కట్టుగా పాటుపడుతుంటామని, స్టాలిన్ ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి, మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమల్‌హాసన్ శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాలు పంపారు.

తమిళంలో గవర్నర్ గ్రీటింగ్స్...

గవర్నర్ ఆర్ఎన్ రవి ముఖ్యమంత్రి స్టాలిన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ తమిళంలో ఓ సందేశం పంపించారు. ప్రియమైన ముఖ్యమంత్రి 72వ జన్మదిన వేడుకలు జరుపుకోవటం తనకెంతో సంతోషంగా ఉందని, ఆయన నాయకత్వంలో తమిళ ప్రజలు అన్ని సదుపాయాలు పొంది సంతోషంగా ఉండాలని అభినందిస్తున్నానన్నారు. ఈ సందేశం చివర ఆర్ఎన్‌రవి అంటూ గవర్నర్ తమిళంలో సంతకం చేయడం కొసమెరుపు. ఇక మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్యమంత్రి స్టాలిన్ తమిళం, ఆంగ్లం, తెలుగు భాషల్లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తమిళగ వెట్రికళగం నేత, నటుడు విజయ్, సీనియర్ నటుడు సత్యరాజ్, కేంద్ర మంత్రి కేసీ వేణుగోపాల్ తదితరులు కూడా స్టాలిన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



నమూనా వ్యవసాయబడ్జెట్ విడుదల చేస్తున్న పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

రేషన్‌షాపుల్లో నాటు చక్కెర

- వరి క్వింటాల్‌కు రూ.3500
- చెరకు టన్నుకు రూ.5వేలు
- సిప్కాట్‌కు స్థలాల సేకరణపై నిషేధం
- పీఎంకే నమూనా వ్యవసాయ బడ్జెట్‌లో ప్రతిపాదనలు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల్లో చక్కెరకు బదులుగా నాటు చక్కెర విక్రయించాలని, క్వింటాల్ ధాన్యానికి రూ.3500 మద్దతు ధర చెల్లించాలని, టన్ను చెరకుకు రూ.5వేల చొప్పున గిట్టుబాటు ధర చెల్లించాలని పీఎంకే విడుదల చేసిన నమూనా వ్యవసాయ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. శనివారం ఉదయం నమూనా బడ్జెట్‌ను పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ విడుదల చేశారు. వార్షిక బడ్జెట్ నిధుల్లో 25 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించాలని, రైతులు ఉత్పత్తి చేసేవన్నీ ప్రభుత్వమే కొనుగోలుచేసేలా చట్ట సవరణ చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర నిర్ణయించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కాయగూరలు, పండ్లకు ప్రతి మూడు నెలలకొకమారు ప్రభుత్వమే ధరలను నిర్ణయించాలని కూడా ఈ నమూనా వ్యవసాయ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా 30 వేలమందికి ఉపాధి కల్పించేలా కావేరి సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని, రేషన్‌షాపుల్లో నాటు చక్కెర, నువ్వుల నూనె, వేరుశెనగ నూనె, కొబ్బరి నూనె సబ్సిడీ ధరకు విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. వన్యమృగాల దాడిలో ప్రాణాలు కోల్పోయేవారి కుటుంబాలకు తలా రూ.25లక్షల ఆర్థిక సాయం అందించాలని, వ్యవయసాయ శాఖలో 50 లక్షల మందికి ఉపాధి కల్పించేలా కొత్త పథకాలు అమలు చేయాలని, ప్రతి తాలూకాలో కూరగాయల నిల్వకోసం శీతలీకరణ గిడ్డంగులు ఏర్పాటు చేయాలని నమూనా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. రాష్ట్రంలో ఇసుక క్వారీలను మూసివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దిండివనం, తంజావూరు, వేలూరు, తిరునల్వేలిలో కొత్త వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమలో కేంద్ర మాజీ మంత్రి ఏకే మూర్తి, తిలక్‌భామా, వడివేల్ రావణన్, అరుళ్, అడయార్ వడివేలు తదితర పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకేతో పొత్తు లేదు

వచ్చే ఎన్నికల్లో టీవీకేదే అధికారం

- రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ధీమా



విజయ్‌తో ప్రశాంత్ కిషోర్

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) వచ్చే శాసనసభ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టిస్తుందని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ధీమా వ్యక్తం చేశారు. ఓ తమిళ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, 2026లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ అన్నాడీఎంకేతో పొత్తుకుదుర్చుకునే అవకాశాలు లేవని తేల్చిచెప్పారు. గత ఏడాది ఫిబ్రవరి 2న టీవీకే అనే రాజకీయ పార్టీని ప్రారంభించిన విజయ్ అదేరోజు ఆ పార్టీ జెండాను రాష్ట్రానికి పరిచయం చేశారు. అనంతరం పార్టీ తొలి మహానాడు విల్లుపురం జిల్లా విక్రవాండిలో 2024 అక్టోబరు 27న భారీస్థాయిలో నిర్వహించి ప్రజాదరణ చూరగొన్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమితో చేతులు కలపకుండా అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకునే అవకాశాలున్నాయని అందరు ఎదురు చూశారు. మరోవైపు ఈ రెండు పార్టీల మధ్య కూటమికి సంబంధించిన చర్చలు కూడా జరిగాయి. ఇదిలా వుండగా, చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో గత నెల 26న జరిగిన టీవీకే ద్వితీయ వార్షికోత్సవంలో విజయ్ ప్రసంగించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై 1967వ సంవత్సరం డీఎంకేను ప్రారంభించి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, మెజార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. డీఎంకే నుండి వైదొలగిన దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ 1977లో అన్నాడీఎంకేను స్థాపించి ప్రజల మద్దతులో అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి రాజకీయ చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పారని, అలాంటి విజయమే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కూడా సాధించడం తథ్యమన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ, విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ తమిళనాట మార్పులు తీసుకొస్తుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇదిలా వుండగా, ఎన్నికల వ్యూహకర్త, జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకులు ప్రశాంత్ కిషోర్ ఓ టీవీ ఛానల్‌లో మాట్లాడుతూ, 2026లో తమిళనాడు అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో టీవీకే అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకునే అవకాశం లేదన్నారు. ఆ దిశగానే విజయ్ వ్యూహం రచిస్తున్నారని, ఆ ఎన్నికల్లో తప్పకుండా అధికారంలోకి వచ్చి విజయ్ చరిత్ర సృష్టిస్తారని ప్రశాంత్ కిషోర్ తెలిపారు.




అఖిలపక్ష సమావేశానికి హాజరుకావడం లేదు

- బీజేపీ నేత అన్నామలై

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన ఈ నెల 5న జరిగే అఖిలపక్ష సమావేశంలో తాము పాల్గొనబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైన ప్రకటించారు. తిరుప్పూరులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో త్రిబాషా విద్యావిధానానికి మద్ధతుగా సంతకాల ఉద్యమం చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే కాకుండా దక్షిణాది రాష్ట్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను తగ్గించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించినప్పటికీ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలను మోసగించేలా కపట నాటకమాడుతున్నారని ఆరోపించారు.

రంజాన్ వేళలు

సహర్: ఆదివారం ఉదయం: 4.44
ఇఫ్తార్: ఆదివారం సాయంత్రం: 6.26
సహర్: సోమవారం ఉదయం: 4.44



కనిపించిన నెలవంక

నేటినుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో ముప్పైరోజుల ఉపవాస దీక్షలు చేపట్టాల్సిందిగా తమిళనాడు ప్రభుత్వ చీఫ్ ఖాజీ డాక్టర్ సలాహుద్దీన్ మహ్మద్ అయూబ్ రాష్ట్రవ్యాప్తంగా వున్న ముస్లింలకు పిలుపునిచ్చారు. శుభప్రదమైన రంజాన్ మాసానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఈ పవిత్ర మాసంలో సమాజంలో మంచి మార్పు కనిపిస్తుంది. ఫిత్రా, దువా, ఆదేశాలు కూడా ఈ నెలలోనే అవతరించాయి. కఠోర ఉపవాస దీక్షలు చేసే ముస్లింలు ఫిత్రా దానం చేయడంతో పేదలకు ఆర్థికంగా కాస్త ఊరట లభిస్తుంది. దివ్య గ్రంథం 'ఖురాన్' అవతరించిన ఈ మాసంలో ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా శాంతి శ్రేయాలే దర్శనమిస్తాయి. అల్లాను ప్రతిరోజు ఐదు వేళల భక్తిశ్రద్ధలతో స్మరిస్తే తలరాతలు మారి అదృష్టం చేకూరుతుందని ఇస్లాం పెద్దలు అభిప్రాయం వ్యక్తంచేశారు. మానవుడు పుట్టినప్పటి నుంచి మరణించే వరకు మసలుకోవాలో ఖురాన్‌లో స్పష్టంగా చెప్పబడివుంది. ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభంకానున్న తరుణంలో అన్ని మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. అలాగే ఉపవాస దీక్షలు చేసే మహిళలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేందుకు పలు మసీదు ప్రాంగణాల్లో ప్రత్యేక గదులు కేటాయించారు. అదే విధంగా పలు ప్రైవేటు విద్యాసంస్థల ప్రాంగణాల్లో కూడా మహిళల ఉపవాస ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. కాగా, ఆదివారం తెల్లవారుజామునే రోజాపై సంకల్పం చేసే ముస్లింలు తప్పకుండా సూర్యోదయానికి ముందే సహార్ భోజనం చేసి, ఉపవాసాలు చేపట్టాలని ముస్లిం పెద్దలు ఉద్బోధించారు.



కారును ఢీకొన్న లారీ

- ఐదుగురి దుర్మరణం

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా తాలవాడి వద్ద శనివారం ఉదయం ఓ లారీ ఎదురుగా వస్తున్న కారును ఢీకొని రోడ్డు పక్కన ఉన్న పల్లపు ప్రాంతంలో బోల్తాపడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళల సహా ఐదుగురు మృతి చెందారు. కర్ణాటకలోని మాండ్య జిల్లాకు చెందిన ఐదుగురు కారులో ఆ రాష్ట్రంలోని మాతేశ్వర ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తుండగా రాష్ట్ర సరిహద్దులోని తాళవాడి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని దారి పక్కనే ఉన్న గోతిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణించిన ఐదుగురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి వెళ్ళి మృత దేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

విద్యుదాఘాతానికి నలుగురు...

కన్నియాకుమారి జిల్లా సముద్ర తీర గ్రామం బుద్ధన్‌తురై వద్ద విద్యుదాఘాతానికి గురై నలుగురు దుర్మరణం చెందారు. శనివారం సాయంత్రం కార్మికులు కొందరు భారీ ఇనుప నిచ్చెన తీసుకెళ్తుండగా ఆ మార్గంలో ఉన్న హైఓల్టేజీ విద్యుత్ వైరును తాకింది. దీంతో ఇనుప నిచ్చెనలో విద్యుత్ ప్రసారం అయి నిచ్చెన మోస్తున్న నలుగురు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సమాచార దర్శిని

కుత్రాలంలో స్నానాలకు నిషేధం

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కుత్రాలం జలపాతం వద్ద నీటి ఉధృతి పెరగడంతో పర్యాటకుల స్నానం చేయకూడదని నిషేధం విధించారు. తెన్‌కాశి జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కుత్రాలం జలపాతంలో నీటి ఉధృతి పెరిగింది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా ప్రధాన జలపాతం వద్ద పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

8 నుంచి పక్షుల గణన

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పక్షుల గణన ఈ నెల 8వ తేది నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు అటవీ శాఖ విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రంలో ప్రతి ఏడాది జనవరి నుంచి మార్చి వరకు పక్షుల గణన చేపడుతుంటామన్నారు. ఈ ఏడాదికి సంబంధించిన గణన 8,9 తేదీల్లో నీటి వనరులు, 15,16 తేదీల్లో బహిరంగ ప్రదేశాల్లో చేపట్టనున్నారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు తమ ప్రాంతాల్లోని పక్షుల శరణాలయాల కార్యాలయం, అటవీ శాఖ కార్యాలయాలను సంప్రదించవచ్చని అటవీ శాఖ తెలియజేసింది.

పెరిగిన పవన విద్యుదుత్పత్తి

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 443 మెగావాట్లున్న పవన విద్యుదుత్పత్తి 1,429 మెగావాట్లకు చేరుకుంది. తిరునల్వేలి జిల్లా పళవూరు, పనకుడి, రాధాపురం, కూడన్‌కుళం తదితర ప్రాంతాల్లో ఉన్న విండ్ మిల్లుల ద్వారా పవన విద్యుదుత్పత్తి జరుగుతోంది. గాలుల వేగం తక్కువగా ఉండడంతో గత వారం 443 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే జరిగింది. రెండు రోజులుగా గాలుల వేగం పెరగడంతో ఉత్పత్తి పెరిగిందని అధికారులు తెలిపారు.

రవాణా కార్యాలయాల్లో కంప్యూటర్ 'టెస్ట్ ట్రాక్'

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలివిడతగా 8 రవాణా శాఖ కార్యాలయాల్లో కంప్యూటర్ 'టెస్ట్ ట్రాక్' ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం వాహన చోదకుల అజాగ్రత్త వల్లే జరుగుతున్నాయి. అందువల్ల డ్రైవింగ్ లైసెన్స్ జారీ క్రమబద్ధీకరించాలని, తగిన శిక్షణ, అవగాహన కల్పించాలని రవాణా శాఖను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 91 ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో తొలివిడతగా 20 కార్యాలయాల్లో డ్రైవర్ పరీక్ష ట్రాక్‌లను కంప్యూటర్ ట్రాక్‌లుగా మార్చాలని నిర్ణయించారు. ఈ ప్రకారం, కొన్ని ఆటోమొబైల్ సంస్థల సహకారంతో, తిరువణ్ణామలై, కడలూరు, సేలం,నామక్కల్, దిండుగల్, పెరంబలూరు, తిరుచ్చి, మదురై తదితర 8 ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాల్లో కంప్యూటర్ టెస్ట్ ట్రాక్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

వారణాసి, పట్నాకు విమానసేవలు

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి పట్నా, వారణాశికి రోజూ విమానాలు నడుపనున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటించింది. ప్రస్తుతం చెన్నై నుంచి 'ఇండిగో ఎయిర్‌లైన్స్' మాత్రమే పాట్నా, వారణాశికి విమానాలు నడుపుతోంది. ఈ మార్గాల్లో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో తాము కూడా విమాన సేవలు అందించనున్నట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. ఆ ప్రకారం, మార్చి 30వ తేది నుంచి పట్నాకు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు బయల్దేరే విమానం 8.50 గంటలకు పట్నా చేరుకుంటుంది. మరుమార్గంలో, పట్నా నుంచి 9.20 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.10 గంటకు చెన్నై చేరుకుంటుంది. అలాగే, చెన్నై నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరే విమానం సాయంత్రం 4.40 గంటలకు వారణాశి చేరుకుంటుంది. మరుమార్గంలో వారణాశి నుంచి సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రాత్రి 7.55 గంటలకు చెన్నై చేరుకుంటుందని సంస్థ తెలియజేసింది.

కోయంబేడులో టాయిలెట్ రుసుము నిలిపివేత

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్ ప్రాంగణంలో టాయిలెట్‌కు వసూలుచేస్తున్న రుసుము నిలిపివేశారు. ఈ మార్కెట్ ప్రాంగణంలో సుమారు 4 వేలకు పైగా దుకాణాలున్నాయి. ఈ మార్కెట్ ప్రాంగణంలో 94 టాయిలెట్లున్నాయి. వీటిలో ఆహార ధాన్యాల మార్కెట్లో 26 టాయిలెట్లకు ఎలాంటి రుసుము వసూలుచేయడం లేదు. కానీ, పూలు, కాయగూరల మార్కెట్లోని టాయిలెట్లు కాంటాక్ట్ ద్వారా పనిచేస్తుండగా, రూ.5, రూ.10 రుసుము వసూలుచేస్తున్నారు. ఇక, స్నానాలకు రూ.30 వసూలు చేస్తున్నారు. ఈ టాయిలెట్లు కూడా ఉచితంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని వ్యాపారులు, కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మార్కెట్లోని అన్ని ప్రాంతాల్లోని టాయిలెట్లను ఎలాంటి రుసుము చెల్లించకుండా వినియోగించుకోవచ్చని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

'గ్రేట్ చోళ సర్క్యూట్' పర్యాటక యాత్ర

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ 'గ్రేట్ చోళ సర్క్యూట్' పేరుతో తంజావూరులో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు ఒక రోజు పర్యాటక యాత్ర అందిస్తుంది. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచి అయినా పర్యాటకులు పాల్గొనవచ్చు. ఈ యాత్రలో పాల్గొనే పర్యాటకుల తమ సొంత ఖర్చులతో తంజావూరు చేరుకోవాల్సి ఉంది. అక్కడి నుంచి పర్యాటక అబివృద్ధి సంస్థ బస్సులో తీసుకెళ్లనున్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు సాగే ఈ యాత్రలో, తంజావూరు బృహదీశ్వర ఆలయం, పలయారై, ఉదయలూరు, తారాసురం, చోళ హిల్స్ తదితరాలు సందర్శించవచ్చు. ఒకరోజు యాత్రకు ఛార్జీగా రూ.1,500 నిర్ణయించగా, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నారు. మరిన్ని వివరాలకు 9489129765 అనే నెంబరు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పుళల్ పరిధిలోని జేజే నగర్, ఆర్‌ఆర్ కుప్పం, తీర్థన్‌కరై, సోత్తుపాక్కం రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లు ప్రారంభించిన స్టాలిన్

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ సమీపంలో ఉన్న లేడీ వెలింగ్టన్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ తన జన్మదినం సందర్భంగా ఆ పాఠశాలలో ఎల్కేజీ, యూకేజీ, ఒకటో తరగతిలో చేరేందుకు వచ్చిన బాలబాలికలకు స్వీట్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ , ఎంపీ దయానిధి ఆ పాఠశాలకు వెళ్ళగా పాఠశాల నిర్వాహకులు వీరికి స్వాగతం పలికారు. ఆ తర్వాత స్టాలిన్ తన సహాయకులను పంపి అప్పటికప్పుడు పూలదండలు తెప్పిం చి ఆ చిన్నారుల మెడలో వేశారు. ఆ తర్వాత పాఠశాల నిర్వాహకులు అందించిన అడ్మిషన్ పత్రాలను చిన్నారులకు అందజేశారు. ఆ చిన్నారులను తరగతి గది వరకూ నడిపించుకుంటూ వెళ్ళారు.



అడ్మిషన్లు పొందిన చిన్నారులను తరగతి గదికి తీసుకువెళ్తున్న సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రి అన్బిల్ మహేష్, ఎంపీ దయానిధి మారన్

కాట్టుమన్నార్ కోవిల్‌లో రాస్తారోకో

● బీజేపీ కార్యకర్తల అరెస్టు

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కడలూర్ జిల్లా కాట్టుమన్నార్ కోవిల్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించిన మనిదనేయ మక్కల్ కట్చి నాయకులను అరెస్టు చేయాలని కోరుతూ శనివారం ఉదయం రాస్తారోకో చేసిన 86మంది బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వాన్ని ఖండిస్తూ మనిదనేయ మక్కల్ కట్చి నాయకులు శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేసినట్లు తెలిసింది. దీనికి బీజేపీ కార్యకర్తలు అభ్యంతరం తెలపడంతో పోలీసులు ఐదుగురిని మాత్రమే అరెస్టు చేశారు. అయితే ధర్నాలో పాల్గొన్న మనిదనేయ మక్కల్ కట్చికి చెందిన వారందరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మన్నార్‌గుడి బస్ స్టేషన్ సమీపంలో బీజేపీ కార్యకర్తలు రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న జిల్లా ఎస్పీ జయకుమార్ నేతృత్వంలోని పోలీసు బృందం, నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేశారు.



రాస్తారోకోలో బీజేపీ కార్యకర్తలు

రామేశ్వరంలో రెండోరోజు కొనసాగిన జాలర్ల దీక్ష

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికా దళం వైఖరిని ఖండిస్తూ రామనాథపురం జిల్లా రామేశ్వరంలో జాలర్లు శుక్రవారం చేపట్టిన నిరాహార దీక్ష రెండోరోజైన శనివారం కూడా కొనసాగింది. రాష్ట్రం నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్తున్న తమిళ జాలర్లను సరిహద్దులు దాటారనే కారణంగా శ్రీలంక నావికా దళం వారిని అరెస్టు చేయడంతో పాటు వారి పడవలను కూడా స్వాధీనం చేసుకుంటోంది. ఈ చర్యలను ఖండిస్తూ రామనాథపురం జిల్లా మత్స్యకారుల సంఘం పిలుపు మేరకు గత నెల 24 నుంచి జిల్లాకు చెందిన జాలర్లు చేపల వేటను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో రామేశ్వరం, తంగచ్చి మఠం, పాంబన్, మండపం ప్రాంతాలకు చెందిన మరబోట్ల యజమానులు, జాలర్లు చేపట్టిన నిరాహార దీక్షకు డీఎంకే, అన్నాడీఎంకే సహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించడం గమనార్హం.

పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య వినియోగ సిలిండర్ ధరలు ఈ నెలలో రూ.5.50 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరల సవరణకు ఆయిల్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఆ ప్రకారం, ఈ నెలలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.5.50 పెరిగి రూ.1,965కి చేరింది. గత నెలలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,959.50గా ఉంది. అదే సమయంలో గృహ వినియోగ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేకుండా రూ.818.50కి విక్రయమవుతోంది.

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రిటైనింగ్ వాల్‌కు రూ.45 కోట్లు

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై పరిధిలోని 1,220 ట్రాన్స్‌ఫార్మర్ల చుటూ రిటైనింగ్ వాల్స్ ఏర్పాటుకు రూ.45 కోట్లు కేటాయించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కమిషనర్ కుమరగురుపరన్ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో విద్యుత్ కోతలు నివారించేలా అధిక లోడు ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టుపక్కల ప్రజలు చెత్త వేస్తుండడంతో అపరిశుభ్రంగా ఉంటూ దుర్వాసన వస్తోందన్నారు. ఈ విషయమై అందిన ఫిర్యాదులతో దృష్టి సారించిన జీసీసీ, ఉత్తర చెన్నై పరిధిలోని 1,220 ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రూ.45 కోట్లతో రంగులు, వివిధ డిజైన్లతో ఉన్న గోడలు ఏర్పాటు చేస్తున్నామని జీసీసీ కమిషనర్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం హిందీ తప్పనిసరి చేయలేదు

● టీటీవీ దినకరన్

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాల పరిస్థితులకు అనుగుణంగా అవసరమైతే మూడో భాషగా హిందీ నేర్చుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం తాజాగా చేపట్టిన జాతీయ విద్యా విధానంలో ఉందని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం అధ్యక్షుడు టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. తిరుచ్చిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికార డీఎంకే చెబుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం హిందీని నిర్బంధించలేదన్నారు. విద్యా నిధుల విషయం ప్రధాని నరేంద్ర మోదీని సీఎం స్టాలిన్ స్వయంగా కలసి విజ్ఞప్తి చేస్తే, మాతృ ప్రేమ చూపించేలా నిధులు అందజేస్తారని టీటీవీ దినకరన్ తెలిపారు.

6న సచివాలయానికి రవాణా కార్మికుల ర్యాలీ

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆదాయ వ్యయాల మధ్య ఉన్న వ్యత్యాసం భర్తీచేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ రవాణా శాఖ కార్మికులు ఈ నెల 6వ తేది సచివాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ మేరకు రవాణా శాఖలోని సీఐటీయూ, ఏఐటీయూసీ సహా పలు కార్మిక సంఘాల సమాఖ్య విడుదల చేసిన ప్రకటనలో... రవాణా ఉద్యోగులకు ప్రయోజనాలు లేకపోవడం, పదవీవిమరణ పొందిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు సంబంధించి బడ్జెట్‌లో రవాణా శాఖకు నిధులు అందించాలని కోరుతూ ఈ నెల 6న పల్లవన్ రోడ్డు నుంచి సచివాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు ప్రకటించారు.

జీసీసీలో 20కి పెరిగిన జోన్లు

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో ఆరు మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. జీసీసీలో ప్రస్తుతం తిరువొత్తియూర్, మనలి, మాధవరం, తండయార్‌పేట, రాయపురం, తిరువిక నగర్, అంబత్తూర్, అన్నానగర్, తేనాంపేట, కోడంబాక్కం, వలసరవాక్కం, ఆలందూర్, అడయారు, పెరుంగుడి, షోలింగనల్లూర్ అని 15 మండలాలున్నాయి. ఈ నేపథ్యంలో, జీసీసీ నిర్వహణ సరిహద్దులు మార్చుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా కార్పొరేషన్‌లోని మండలాల సంఖ్య 15 నుంచి 20కి పెంచుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు. ఇదివరకే 15 మండలాల్లో ఒకటిగా ఉన్న మనలి మండలాన్ని తిరువొత్తియూర్, మాధవరం మండలాల్లో చేర్చారు. ఆ ప్రకారం, 14 మండలాలున్న తరుణంలో, ప్రస్తుతం కొళత్తూర్, విల్లివాక్కం, చేపాక్కం-ట్రిప్లికేన్, త్యాగరాయ నగర్, విరుగంబాక్కం, పెరుంగుడి-షోలింగనల్లూర్ తదితర ఆరు మండలాలు కొత్తగా చేర్చడంతో, జీసీసీ పరిధిలోని మండలా సంఖ్య 20కి పెరిగింది.

మెట్రోరైళ్లలో 86.65 లక్షల మంది పయనం


పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో ఫిబ్రవరి లో 86.65 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) విడుదల చేసిన ప్రకటనలో... మెట్రోరైళ్లలో జనవరిలో 86,99,344 మంది ప్రయాణించగా, ఫిబ్రవరిలో 86,65,803 మంది ప్రయాణించారు. వీరిలో 'ట్రావెల్ కార్డ్ ' ద్వారా 14,80,150 మంది, టోకెన్ల ద్వారా 936 మంది, గ్రూప్ టిక్కెట్ల ద్వారా 6,046, క్యూ ఆర్ వినియోగించి 37,56,385 మంది, 'సింగార చెన్నై' కార్డు ద్వారా 34,22,286 మంది ప్రయాణించారు. ఫిబ్రవరి 7వ తేది అత్యధికంగా 3,56,300 మంది ప్రయాణించినట్లు సీఎంఆర్‌ఎల్ తెలిపింది.

కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లాలో శనివారం తెల్లవారుజామున హఠాత్తుగా భారీవర్షం కురిసింది. ఉదయం వరకు కురిసిన వర్షంతో ఉళుందూర్‌పేట సమీపం కె.కళ్లకుర్చిలోని కొనుగోలు కేంద్రంలో విక్రయానికి ఉంచిన సుమారు 5 టన్నుల ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రంలో సరైన వసతులు ఏర్పాటుచేయకపోవడంతో వరి తడిచిందని, తగిన ధర లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మేం అధికారంలోకి వస్తే గృహిణులకు రూ.2వేలు

● అన్నాడీఎంకే నేత పొల్లాచ్చి జయరామన్



ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్ళీ అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గృహిణులకు ప్రతినెల రూ.2వేలు ఇస్తామని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్ పేర్కొన్నారు. తిరుప్పూర్‌లో శనివారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతి సందర్భంగా పేదలకు సహాయాలను పొల్లాచ్చి జయరామన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డీఎంకే పాలనలో విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్ను, ఆస్తి పన్ను, భూగర్భ డ్రైనేజీ పన్నులను పెంచారని వ్యాఖ్యానించారు. గత పదేళ్ళ అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఇలాంటి పన్నులు పెంచలేదని, డీఎంకే కూటమిలోవున్న మిత్రపక్షాలకు ఈ విషయం తెలిసినా అధికార డీఎంకేను నిలదీయకుండా రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మరికొద్ది రోజుల్లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే ప్రభుత్వం తప్పకుండా అధికారంలోకి వస్తుందని పొల్లాచ్చి జయరామన్ నమ్మకం వ్యక్తంచేశారు.

వంద మందికి కెవిన్‌కేర్ కృత్రిమ అవయవదానం

అడయార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'వాక్ ఇండియా' క్యాంపెయిన్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రీడమ్ ట్రస్ట్‌తో కలిసి కెవిన్ కేర్ సంస్థ వంద మందికి కృత్రిమ అవయవాలు అందించింది. ఈ సంస్థ గత దశాబ్దకాలంలో దేశ వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా కృత్రిమ అవయవాలను అందించింది. తాజాగా తంజావూరులో జరిగిన పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వంద మందికి ప్రయోజనం చేకూర్చింది. ఈ కార్యక్రమంలో కెవిన్‌కేర్ వైస్ ప్రెసిడెంట్ సాయి వెంకటరామన్, ఫ్రీడమ్ ట్రస్టీ శంకరన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరన్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా అంగవైకల్యం కలిగిన వారికి సహాయాన్ని అందించడంలో కెవిన్‌కేర్‌తో అనుబంధం కలిగివున్నందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. గత తొమ్మిది ఎడిషన్‌లలో అస్సోం, హరిద్వార్, గౌహతి, ఈరోడ్, కృష్ణగిరి, కాంచీపురం, కడలూరు వంటి ప్రాంతాల నుంచి 950 మందిని ఎంపిక చేసిన లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు.



కృత్రిమ అవయవాలు అందుకున్నవారితో కేవిన్‌కేర్, ఫ్రీడమ్ ట్రస్టు నిర్వాహకులు

కుమారుడి హత్య కేసులో తల్లికి జీవిత ఖైదు

అడయార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఆరేళ్ళ కుమారుడుని హత్య చేసిన కేసులో కన్నతల్లికి జీవిత కారాగారశిక్ష విధిస్తూ పూందమల్లి కోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పు వివరాలను పరిశీలిస్తే, కలైయన్‌చావడికి చెందిన మీనాక్షి (27) కృష్ణగిరికి చెందిన శరవణన్ (34) అనే వ్యక్తిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. వీరికి జయకాంత్ అనే ఆరేళ్ళ కుమారుడున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వీరిద్దరూ గొడవపడేవారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మీనాక్షి 018 డిసెంబరులో తన ఆరేళ్ళ కుమారుడుని హత్య చేసి, శవాన్ని కాల్చివేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మీనాక్షిని అరెస్టు చేశారు. కేసు విచారణ పూందమల్లిలోని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రెండో కోర్టు విచారణ జరిపి.. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలతో మీనాక్షికి జీవిత కారాగారశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

మారిషష్ విమానం రద్దు

అడయార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మారిషష్ దేశంలో బలమైన ఈదురుగాలులు, వర్షం కారణంగా చెన్నై రావాల్సిన ఎయిర్ మారిషియస్ విమానాన్ని రద్దు చేశారు. ఈ కారణంగా చెన్నై నుంచి ఆ దేశానికి వెళ్లాల్సిన 277 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతి శనివారం అర్ధరాత్రి 1.50 గంటల సమయంలో ఎయిర్ మోరిషియస్ విమానం చెన్నై వచ్చి, తిరిగి వేకువజామున 3.35 గంటలకు బయలుదేరి వెళుతుంది. ఆ ప్రకారంగా శనివారం వేకువజామున రావాల్సిన విమానాన్ని రద్దు చేశారు. మారిషష్ దేశంలో ఈదురుగాలు లు కారణంగా ఈ విమానాన్ని రద్దు చేశారు.

జనావాసాల్లోకి మొసలి



మొసలిని బంధిస్తున్న అటవీ సిబ్బంది

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా జనవాసంలోకి ప్రవేశించిన మొసలిని గ్రామస్తుల సాయంతో అటవీ సిబ్బంది బంధించారు. కుమారాట్చి ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం కుక్కలు మొరుగుతుండడంతో కొందరు యువకులు వెళ్లి చూడగా, అక్కడ 5 అడుగుల మొసలి సంచరిస్తూ ఉండడం గమనించారు. ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లొద్దని హెచ్చరించిన యువకులు, అటవీ సిబ్బందికి సమాచారం అందించి. వారు అక్కడకు చేరుకొని గ్రామస్తుల సాయంతో మొసలిని బంధించి కొళ్లిడం నదిలో వదలిపెట్టారు.

● ఊత్తంగరైలో వింత

శైవదర్శనానికి కోడిపుంజు



శివలింగం వద్ద నిలిచిన కోడిపుంజు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై వద్ద కొత్తగా నిర్మిస్తున్న ఆలయ ప్రాంతంలో శివలింగాన్ని రోజూ ఓ కోడి పుంజు దర్శించడం స్థానికులను విస్మయపరుస్తోంది. ఊత్తంగరై సమీపం రామకృష్ణాంపతి వద్ద కొత్త శివాలయ నిర్మాణ జరుగుతోంది. అక్కడ పునాదులు తవ్వుతుండగా ప్రాచీన కాలం నాటి శివలింగం బయల్పడింది. ఆ శివలింగాన్ని ఓ తాటాకుల పర్ణశాలలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఓ కోడిపుంజు వచ్చి శివలింగాన్ని దర్శిస్తోంది. సుమారు ముప్పావు గంట వరకూ కదలకుండా తపస్సు చేసేలా నిలిచి శివలింగం వైపే దృష్టిసారిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు ఆ కోడిపుంజును చూడటానికి బారులు తీరుతున్నారు. జనాన్ని చూసిన ఆ కోడి పుంజు తపస్సు అయిన తర్వాతే అక్కడినుండి కదలుతోంది. ఈ వింతను చూడటానికి రోజూ భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు.

కిరోసిన్ తాగి బాలుడి మృతి

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శీతల పానీయం అనుకొని కిరోసిన్ తాగిన రెండేళ్ల చిన్నారి అస్వస్థతకు గురై మృతి చెందింది. కన్నియాకుమారి జిల్లా సౌరువల్లూర్ తేవికాడు ప్రాంతానికి చెందిన అనీల్-అరుణ దంపతులకు అనిరుధ్ (5), ఆరోన్ (2) అని ఇద్దరు కుమారులున్నారు. రెండేళ్ల క్రితం అనీల్ వెన్నెముకకు తీవ్రగాయం అవడంతో ప్రస్తుతం నడవలేని పరిస్థితుల్లో ఉండగా, భార్య అరుణ అతనికి సపర్యలు చేస్తోంది. గురువారం సాయంత్రం వంట గదిలోకి వెళ్లిన ఆరోన్ ఓ సీసాలో శీతల పానీయం అనుకొని తాగాడు. బాలుడు తల్లి శీతల పానీయం సీసాలో కిరోసిన్ ఉంచింది. అది తెలియక తాగిన ఆరోన్ కొద్దిసేపటికి వాంతులు చేసుకోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో అరుణ, కుమారుడిని కారకోణం ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తిరువనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక శుక్రవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు సీమాన్ అప్పీలుపై విచారణ

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ అప్పీలు పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది. వివాహం చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేసినట్లు సీమాన్‌పై నటి విజయలక్ష్మి 2011లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు ప్రకారం సెక్షన్ 376 ప్రకారం కేసు నమోదుచేసినట్లు పోలీసు శాఖ తరపున తెలియజేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణ జరిపి 12 వారాల్లో నివేదిక సమర్పించాలని వలసరవాక్కం పోలీసులకు గత నెల 21వ తేది మద్రాసు హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు రెండు సార్లు సమన్లు పంపినా హాజరుకాని సీమాన్, శుక్రవారం వలవరవాక్కం పోలీస్‌స్టేషన్‌లో హాజరయ్యారు. ఈ నేపథ్యంలో, మద్రాసు హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా సీమాన్ సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. 12 వారాల్లో విచారణ ముగించాలనే మద్రాసు హైకోర్టు ఉత్తర్వులకు తాత్కాలిక స్టే విధించాలని పిటిషన్‌లో సీమాన్ కోరారు. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు విచారించనుంది.

శ్రీలంక మహిళకు నగలు అప్పగింత

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధంగా తరలించారని శ్రీలంక మహిళ వద్ద స్వాధీనం చేసుకున్న మంగళసూత్రం, గాజులను కోర్టు ఉత్తర్వుల మేరకు చెన్నై కస్టమ్స్ అధికారులు సంబంధిత మహిళకు తిరిగి అప్పగించారు. 2023 డిసెంబరులో శ్రీలంకకు చెందిన ఓ మహిళ కుటుంబ సభ్యులతో కలిసి విమానంలో చెన్నై వచ్చారు. అప్పుడు కస్టమ్స్ అధికారులు ఆ మహిళ సహా ముగ్గురు ధరించిన నగలు అక్రమంగా తరలించారనే కారణంగా స్వాధీనం చేసుకున్నారు. తమ నగలను తిరిగిచ్చేలా ఉత్తర్వులివ్వాలని సంబంధిత మహిళ తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల జరిగిన ఈ కేసు విచారణకు హాజరైన పిటిషనర్ తరుపు న్యాయవాదులు మహిళలు మెడలో పవిత్రంగా ధరించే మంగళసూత్రం అక్రమ రవాణా అంటూ కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడం సరికాదని వాదించారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం పిటిషనర్‌కు మద్దతుగా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో శనివారం రాత్రి శ్రీలంక నుండి కుటుంబ సభ్యులతో చెన్నై విమానాశ్రయానికి వచ్చిన ఆ మహిళ కస్టమ్స్ కార్యాలయానికి వెళ్లి,తన మంగళసూత్రం, గాజులు తదితర నగలను తీసుకుని హర్షంవ్యక్తం చేశారు.

అన్ని జోన్లలో విక్రయ బృందాలను నియమించాలి

● కార్పొరేషన్‌కు హైకోర్టు ఆదేశం

అడయార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని అన్ని జోన్లలో నగర విక్రయ బృందాలను నియమించాలని నగర పాలక సంస్థకు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. టి.నగర్‌కు చెందిన మీనాక్షి, చెల్లమ్మాళ్‌తో సహా ఎనిమిది మంది మద్రాస్ హైకోర్టులో ఒక పిటిషన్ వేశారు. చెన్నై మహానగరంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారాలకు అనుమతివ్వాలని కోరుతూ చేసుకున్న దరఖాస్తులను పరిశీలించేలా చెన్నై కార్పొరేషన్‌ను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తులు ఆర్.సురేష్ కుమార్, ఏటీ జగదీష్ చంద్ర విచారించారు. ఈ కేసులో ఇరు వర్గాల వాదనలు ఆలకించిన ధర్మాసనం.. చిరు వ్యాపారులు దరఖాస్తులన్నింటినీ పరిశీలించేందుకు చాలాకాలం పడుతుందని, అందువల్ల నగర విక్రయ బృందాలను ఏర్పాటుచేసి, తద్వారా రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే ప్రాంతాలు, వ్యాపారం చేయలేని ప్రాంతాలు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ తదుపరి తీసుకునే చర్యలను ఏప్రిల్ 28వ తేదీ నివేదిక రూపంలో కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు.

కోర్టు డ్రామా నేపథ్యంలో
ఎస్‌ఏసీ 'కూరన్'


'కూరన్'లో ఎస్ఏ చంద్రశేఖర్

సీనియర్ దర్శక నిర్మాత, నటుడు ఎస్ఏ చంద్రశేఖర్ (ఎస్ఏసీ) ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'కూరన్'. కోర్టు డ్రామా నేపథ్యంలో రూపొందించారు. ఇతర పాత్రల్లో వైజీ మహేంద్రన్, శరవణ సుబ్బయ్య, సత్యన్, బాలాజీ శక్తివేల్, జార్జ్ మరియన్, కవితా భారతి, ఇంద్రజ, రోబో శంకర్ తదితరులు నటించారు. నితిన్ వేమువతి దర్శకత్వం వహించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఒక జాగిలం చుట్టూ కథ తిరుగుతుంది. 'కూరన్' అంటే తెలివితేటలు కలిగినదని అర్థం. రిటైర్డ్ జడ్జి పాత్రలో వైజీ మహేంద్రన్ ఓ ఇంటర్వ్యూలో తన గత అనుభవాలను చెప్పడంతో సినిమా ప్రారంభమవుతుంది. ఝాన్సీ అనే శునకానికి జరిగిన అన్యాయంపై ఇచ్చిన తీర్పు. ఒక శునకం తనకు జరిగిన అన్యాయానికి న్యాయం కోరుతూ పోలీస్ స్టేషన్‌కు వెళుతుంది. అక్కడ నుంచి న్యాయవాది ధర్మరాజ్ (ఎస్ఏ చంద్రశేఖర్) ఇంటికి చేరుతుంది. ఆ కుక్కను గమనించిన న్యాయవాది దానిని అనుసరిస్తారు. ఆ తర్వాత ఆ శునకానికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకుని, దానికి న్యాయం చేసేందుకు ముందుకు వస్తారు.నోరులేని మూగజీవానికి న్యాయం జరిగిందా? ఆ జాగిలానికి న్యాయం చేసేందుకు న్యాయవాది చేసిన న్యాయపోరాటం ఫలించిందా?ఇత్యాది అంశాలతో ఈ చిత్రాన్ని ఆసక్తికరమైన కోర్టు డ్రామాగా తెరకెక్కించాం. ఇందులో ధర్మరాజ్ అనే న్యాయవాది పాత్రలో ఎస్ఏ చంద్రశేఖర్ నటించారు. మహారాష్ట్రలో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా చేసుకుని ఈ మూవీని రూపొందించారు' అని వివరించారు.



కొత్త వారికి అవకాశం ఇవ్వడమే కల

తమిళ చిత్రజ్యోతి

● యువన్ శంకర్ రాజా

పరిశ్రమలో సినిమా అవకాశాల కోసం ఎదురుచూసే ప్రతిభావంతులైన కొత్త నటీనటులకు, టెక్నీషియన్లకు అవకాశం ఇవ్వడమే తన కల అని ప్రముఖ సంగీత దర్శకుడు, సినీ నిర్మాత యువన్ శంకర్ రాజా అన్నారు. తన సొంత బ్యానర్ వైఎస్ఆర్ ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కించిన సినిమా 'స్వీట్‌హార్ట్'. స్వినీత్ ఎస్.సుకుమార్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రియో రాజ్, గోపికా రమేష్, రంజి పణిగర్, రెడిన్ కింగ్స్లీ, అరుణాచలేశ్వరన్, సురేష్ చక్రవర్తి, తులసి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చిన ఈ చిత్రం ఈ నెల 14వ తేదీ విడుదల చేస్తున్న నేపథ్యంలో తాజాగా ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక నగరంలో నిర్వహించారు. ఇందులో యువన్ శంకర్ రాజా మాట్లాడుతూ, 'ఈ సినిమా ప్రారంభించేముందు ఒక ఇంట్రో రిలీజ్ చేశాం. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. నేను టూర్‌కు వెళ్ళి వచ్చేలోపు సినిమా పూర్తి చేశారు. సినిమా చాలా బాగా వచ్చింది. ఆ తర్వాతే నాలో ఎక్కడలేని ఉత్సాహం, ఆనందం కలిగింది. సినిమాలో మరో రెండు పాటలను జత చేశాను. ఇపుడు స్వీట్‌హార్ట్ మూవీ ఎంతో అద్భుతంగా వచ్చింది. ఇది దర్శకుడు స్వినీత్ తరహాలోనే ఎంతో మంది కొత్త కళాకారులకు, దర్శకులకు, నటీనటులకు సినిమా అవకాశాలు కల్పించడమే నా కల' అని అన్నారు. హీరో రియోరాజ్ మాట్లాడుతూ, 'ఈ వేదికపై నుంచి మాట్లాడిన ప్రతి ఒక్కరూ యువన్ అభిమానులే. 14న విడుదలయ్యే ఈ మూవీ పూర్తిగా రొమాంటిక్ డ్రామా. దర్శకుడిపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టారు. ప్రతి ఒక్కరూ చూసి ఆనందించేలా ఈ సినిమా ఉంటుంది. ఇందులో ఓ పాట కూడా రాశాను. ప్రతి ఒక్కరూ థియేటర్‌కు వెళ్ళి సినిమాను చూసి సపోర్టు చేయండి' అని కోరారు. దర్శకుడు స్వినీత్ మాట్లాడుతూ, "జో సినిమా సూపర్ డూపర్ హిట్ అయిన తర్వాత రియో రాజ్‌కు అనేక అవకాశాలు వచ్చాయి. కానీ, నాకు ఇచ్చిన మాటకు కట్టుబడి వేరేవారికి కమిట్ కాకుండా, ఈ ప్రాజెక్టు పూర్తి చేశారు. సాధారణంగా ఒక చిత్రానికి దర్శకుడును కెప్టెన్‌గా చెబుతారు. కానీ, ఈ మూవీకి యువన్ శంకర్ రాజానే కెప్టెన్. ఈ మూవీలో నాలాంటి వారు అనేక మంది వెండితెరకు తొలిసారి పరిచయమవుతున్నారు' అని వెల్లడించారు.

సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో
అదరగొట్టిన అజిత్



అగ్రహీరో అజిత్ కుమార్ నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. యంగ్ డైరెక్టర్ ఆధిక్ రవి చంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. ఇప్పటికే ఆసక్తికరమైన పోస్టర్లతో అలరించిన ఈ చిత్రం... తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. ఇందులో అజిత్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో అదరగొట్టాడు. గత చిత్రం 'విడాముయర్చి'తో నిరాశపడిన అజిత్ ఫ్యాన్స్.. ఈ మూవీ భారీ హిట్ ఇస్తుందనే ధీమాగా ఉన్నారు. అజిత్ ఫ్యాన్స్ ఆశించే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నట్టు టీజర్ చూస్తే అర్థమవుతుంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చగా, ఏప్రిల్ 10వ తేదీ సినిమాను సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ చేయనున్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రంలో త్రిష హీరోయిన్. కోలీవుడ్ సీనియర్ నటుడు ప్రభు, ప్రసన్న, అర్జున్ దాస్, సునీల్ కీలక పాత్రలను పోషించారు.

రీ-ఎంట్రీకి ఇదే సరైన తరుణం

● నటి రంభ



సినిమాల్లో తన రీఎంట్రీకి సరైన తరుణమని నటి రంభ అంటున్నారు. 1983లో వచ్చిన 'ఊళవన్' మూవీ ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన రంభ... ఆ తర్వాత హీరో కార్తిక్ నటించిన 'ఉల్లత్తై అల్లిత్తా' సినిమా ద్వారా తమిళ ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు. తమిళం, తెలుగుతో పాటు దక్షిణాది భాషల్లో వందకుపైగా చిత్రాల్లో నటించిన రంభ 2010లో ఇంద్రకుమార్ పద్మనాభన్ అనే వ్యాపారవేత్తను వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ముగ్గురు సంతానం. దుబాయ్‌లో ఉంటున్న రంభ.. అపుడపుడూ చెన్నై, హైదరాబాద్ నగరాలకు విజిట్ చేస్తుంటారు. పిల్లలు పెద్దవారు కావడంతో ఆమె సినిమాల్లో నటించేందుకు మళ్ళీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ విషయంపై రంభ మాట్లాడుతూ, 'సినిమా నాకు ఎప్పటికీ తొలి ప్రేమ. అలాంటి చిత్రపరిశ్రమలోకి మళ్ళీ అడుగుపెట్టాలని భావిస్తున్నాను. నటిగా ఛాలెంజింగ్ పాత్రల్లో నటించేందుకు ఇదే సరైన తరుణమని గట్టిగా నమ్ముతున్నాను. వైవిధ్య భరితమైన కథా చిత్రాల్లో ప్రేక్షకులను అలరించే పాత్రలు, కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో నటించేందుకు ఎదురు చూస్తున్నాను' అని వెల్లడించారు.





సోదరి కనిమొళి నివాసంలో కరుణాధి సతీమణి రాజాత్తి అమ్మాళ్ ఆశీస్సులందుకున్న స్టాలిన్ - అరివాలయంలో తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ఈరోడ్ జిల్లా తొండగతోప్పు, కరుంపరై గిరిజన గ్రామాలకు చెందిన బాలబాలికలతో సీఎం స్టాలిన్

సీఎం స్టాలిన్‌కు శుభాకాంక్షల వెల్లువ


అరివాలయం వద్ద స్టాలిన్‌కు కానుకలు మోసుకొస్తున్న పార్టీకార్యకర్తలు

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ 72వ జన్మదిన వేడుకలు శనివారం వద్ద అట్టహాసంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల నడుమ స్టాలిన్ జన్మదినవేడుకలలో పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. స్టాలిన్ తనయుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఆయన సతీమణి కృత్తిక, కుమార్తె సెంతామరై, అల్లుడు శబరీషన్, మనవలు, మనవరాళ్ల సమక్షంలో స్టాలిన్ కేక్ కట్ చేసి కుటుంబ సభ్యులందరికీ తినిపించారు. ఈ సందర్భంగా స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్ సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పూలమాలలు ధరించారు. ఇక రాష్ట్రమంత్రులు, పార్టీ ప్రముఖులు వారం రోజుల ముందు నుంచే స్టాలిన్ ముందస్తు జన్మదిన వేడుకల పేరుతో భారీ యెత్తున కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు యేడాది పొడవున నగరంలో రోజుకో ప్రాంతంలో పేదలకు ఉదయం అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఇదే రీతిలో మరో మంత్రి ఎం.సుబ్రమణ్యం నగరమంతా నిరుపేదలకు సహాయాలు పంపిణీ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలునిర్వహించారు. అదేవిధంగా డీఎంకే సీనియర్ నేతలు నగరమంతటా సభలు, సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


స్టాలిన్‌కు శాలువ, పుస్తకం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ అప్పావు







స్టాలిన్‌ను సత్కరిస్తున్న టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై - స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎండీఎంకే నేతలు వైగో, దురై వైగో - అరివాలయంలో కేక్ కట్ చేసి తనయుడు ఉదయనిధికి తినిపిస్తున్న స్టాలిన్


మంచు పరదాల మాటున ఏర్కాడు

ఉత్సాహంగా తిరిగిన పర్యాటకులు

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పిలువబడుతున్న ఏర్కాడుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధానమైన వేసవి విడిదికేంద్రాల్లో ఒకటైన ఏర్కాడులో మంచు దట్టంగా వ్యాపించడంతో పర్యాటకులు హర్షంవ్యక్తం చేశారు. పర్వత శ్రేణులపై, ప్రకృతి అందాల మధ్య ఉన్న ఏర్కాడులో శీతాకాలం సీజన్ గత మూడు నెలలుగా కొనసాగుతోంది. వసంత రుతువులో ఇక్కడి చల్లటి ఆహ్లాదరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు శని,ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఈ నేపథ్యంలో వేసవి సీజన్‌కు ముందే ఎండ వేడి ప్రభావం పెరుగుతుండటంతో దాని నుండి ఉపశమనం పొందేందుకు ప్రజలు వేసవి విడిది కేంద్రాల బాట పడుతున్నారు. శనివారం తెల్లవారుజాము నుండే ఏర్కాడులో మంచు దట్టంగా కమ్ముకుంది. ఏర్కాడులో బసచేసిన పర్యాటకులు ఉదయం వేళ మంచు కురుస్తుండటంతో అక్కడున్న బోట్‌హౌస్, అన్నాపార్క్, లేక్ వ్యూపార్క్, బొటానికల్ పార్క్, రోస్‌పార్క్, లేడీసీట్, జంట్స్‌సీట్, కిలియూర్ జలపాతం, కరడియూర్ వ్యూ పాయింట్, మంజకుట్టై సరస్సు తదితర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులతో కలిసి సెల్ఫీలు తీసుకుంటూ చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు.


ఏర్కాడులో దట్టంగా అలముకున్న మంచు

తిరుచెందూర్‌లో కోలాహలంగా రథోత్సవం

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లో ప్రసిద్ధి చెందిన సుబ్రమణ్యస్వామి అనుబంధ ఆలయం వేయిళ్ కాంతమ్మ ఆలయ మాసి ఉత్సవాల రథోత్సవం శనివారం ఉదయం కోలాహలంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథాన్ని లాగి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆలయంలో గత నెల 20వ తేదీ ధ్వజారోహణంతో మాసిమాసం పదిరోజుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆ రోజు నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ వాహనాల్లో ఊరేగిస్తున్నారు. ముగింపు రోజైన శనివారం ఉదయం 7గంటలకు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ అర్చకులు రథంపై ఉంచారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడవీధుల్లో రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ జ్ఞానశేఖరన్ సహా పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. స్థానిక పోలీసులు భద్రతా విధులు నిర్వహించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం


చెరువులో చేపలు పడుతున్న ప్రజలు

ఉత్సాహంగా చేపలు పట్టే ఉత్సవం

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా విరాలిమలై సమీపంలో తిరునల్లూర్ పెద్ద చెరువులో శనివారం చేపలు పట్టే ఉత్సవం కోలాహలంగా సాగింది. ప్రతి ఏడాది కోత పనులు ముగిసిన అనంతరం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించిన అనంతరం సమీపంలోని చెరువులో చేపలు పట్టే ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం పూజల అనంతరం గ్రామ పెద్దలు జెండా ఊపి చేపలు పట్టే వేడుకలు ప్రారంభించారు. అప్పటికే చెరువు చుట్టూ సిద్ధంగా ఉన్న పిల్లలు, మహిళలు, పెద్దలు చెరువులో దిగి చేపలు పట్టారు. ఈ సారి రొయ్యలు ఎక్కువగా లభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో తిరునల్లూరుతో పాటు చుట్టుపక్కల ఉన్న సుమారు పది గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


లభించిన రొయ్యలు


తన జన్మదినం సందర్భంగా సతీమణి దుర్గాస్టాలిన్‌తో కలిసి చెన్నైలోని "సిరుమలర్" పాఠశాలలో శనివారం సాయంత్రం దృష్టిలోపం, వినికిడిలోపం కలిగిన పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న సీఎం స్టాలిన్

ఘనంగా బంగారు అడిగళార్ జయంతి

● మేల్ మరువత్తూరుకు ఆధ్యాత్మిక శోభ

ప్యారీస్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూరు ఆది పరాశక్తి సిద్ధర్ పీఠంలో ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగళార్ జయంతి వేడుకలు ఘనంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 3న బంగారు అడిగళార్ 85వ జయంతిని పురస్కరించుకుని ఆది పరాశక్తి సిద్ధర్ పీఠంలో ఐదు రోజులు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఆది పరాశక్తి ఆధ్యాత్మిక సంస్థ అధినేత లక్ష్మి బంగారు అడిగళార్ , ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షురాలు శ్రీదేవీ బంగారు, లక్ష్మి బంగారు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరస్పాండెంట్ ఆశా అన్బలగన్ తదితరుల పర్యవేక్షణలో శనివారం ఉదయం 9గంటలకు నేత్రపర్వంగా రథోత్సవం జరిగింది. వచ్చే సోమవారం అడిగళార్ పుట్టిన రోజును పురస్కరించుకుని సంక్షేమ సహాయాలను పేదలకు పంపిణీ చేయనున్నారు. ఇందులో మలేషియా దౌత్య కార్యాలయ భారత ప్రతినిధి శరవణకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక సావనీరును ఆవిష్కరిస్తారు. పీఠంలో ఐదురోజులు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.


బంగారు అడిగళార్ జయంతి వేడుకలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు



తిరుమలేశుడి సేవలో
నటి మెహరీన్

సినీ నటి మెహరీన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత సేవలో ఆమె పాల్గొన్నారు. సుప్రభాత పఠనం పూర్తికాగానే గర్భాలయానికి చేరుకుని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, ఆలయం ముందు మెహరీన్‌ను చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముక్కంటి సేవలో
నటి హన్సిక



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సినీ నటి హన్సిక దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఆమెకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

నేడు స్థానికుల దర్శన కోటా టోకెన్ల జారీ

ప్రతినెలా మొదటి మంగళవారం తిరుపతి, తిరుమల స్థానికులకు కల్పించే శ్రీవారి దర్శన కోటా టోకెన్లను టీటీడీ ఆదివారం జారీ చేయనుంది. ఈ నెల 4వ తేదీన టీటీడీ స్థానికులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి వాసులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమల స్థానికులకు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన ఆదివారం ఉదయం 5 గంటల నుంచి టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానికులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.24 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 52,731

తలనీలాలు సమర్పించినవారు: 17,664



కల్యాణం.. కమనీయం

- వైభవంగా ఆదిదంపతుల వివాహ వేడుక
- తరలివచ్చిన భక్తజనం
- ఒక్కటైన 41 జంటలు



శ్రీకాళహస్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనంత విశ్వమే పందిరిగా... ఆచంద్రతారలే అలంకారాలుగా... భూమండలమే వివాహ వేదికగా... పంచభూతాల సాక్షిగా... అష్టదిక్కులు, ముల్లోకాల నుంచి ముక్కోటి దేవతాగణాలు వీక్షిస్తుండగా... అశేష భక్తజన వాహిని మధ్య శనివారం ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరుడు మాంగల్యధారణ చేశారు. ఇదే శుభ ఘడియలో ఆది దంపతుల సమక్షంలో 41 జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యాయి. వధూవరులకు ముక్కంటి ఆలయం తరఫున మంగళసూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. అంతకు మునుపు శుక్రవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తదనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అధిష్టింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కళాకారుల ఆటలు, పాటల మధ్య ఆది దంపతులు పెండ్లిమండపం వద్దకు చేరుకున్నారు. మొదట పరమేశ్వరుడు చేరుకోవడంతో పార్వతీదేవి అలకబూనారు. చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం నిర్వహించి అమ్మవారి అలక తీర్చారు. గంగాధరుడు, శివానీ పెళ్లిపీటలపై ఆశీసులయ్యారు. వేదపండితులు కలశ స్థాపన చేశారు. సంకల్పం, యజ్ఞాహుతి పూజలు పూర్తి చేశారు. పూజల అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛరణలు చేస్తూ ఆదిదంపతుల కల్యాణ ఘట్టాన్ని పూర్తిచేశారు. కల్యాణం వీక్షించడానికి పట్టణవాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తజనం తరలివచ్చారు. నగరి వీధి, నెహ్రూ వీధి భక్తులతో నిండిపోయాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఈవో బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, టీడీపీ నాయకుడు చెంచయ్యానాయుడు పాల్గొన్నారు.

నేటి వాహన సేవలు
ఉదయం: బనాత అంబారీ వాహన సేవ
రాత్రి: అశ్వ, సింహ వాహనసేవ


నేడు కైలాసగిరి ప్రదక్షిణ

మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు వీడ్కోలు పలికేందుకు స్వామి అమ్మవార్లు ఈ ప్రదక్షిణకు వెళ్లనున్నారు. దీనికి సంబంధించి ఆలయాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గిరి ప్రదక్షిణ మార్గంలో చలువ పందిళ్లు సిద్ధం చేశారు. అన్న ప్రసాదాలు, తాగునీరు, పండ్లు, మజ్జిగ అందుబాటులో పెట్టనున్నారు.


ఆదిదంపతుల కల్యాణోత్సవం సందర్భంగా ఒక్కటైన జంటలు

శరవేగంగా
చెన్నై ఎయిర్‌పోర్టు విస్తరణ

రూ.1207 కోట్లు కేటాయింపు
8 ప్రవేశ ద్వారాలు, 60 చెక్ ఇన్ కౌంటర్లు



అడయార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి నానాటికీ పెరిగిపోతోంది. దీంతో ఈ విమానాశ్రయాన్ని మరింత విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.1207 కోట్లు ఖర్చు చేయనున్నారు. విస్తరణలో భాగంగా ఎనిమిది ప్రవేశద్వారాలు, 60 చెక్ ఇన్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎయిర్‌పోర్టుకు 2015లో 2.2 కోట్ల మంది ప్రయాణికులు వచ్చి వెళ్లేవారు. 2025 నాటికి 3.5 కోట్లకు పెరిగింది. ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. దీంతో విమానాశ్రయాన్ని మరింతగా విస్తరించేలా చర్యలు చేపట్టగా, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కూడా అనుమతివ్వడంతో పాటు నిధులను కేటాయించింది. రూ.2,467 కోట్లతో 2.36 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణం మేరకు రెండు దశల్లో విస్తరించాలని నిర్ణయించారు. ఆ ప్రకారంగా తొలి దశ విస్తరణ పనులను రూ.1,260 కోట్లతో 1.36 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలోనూ, రెండో దశ విస్తరణ పనులను రూ.1,260 కోట్లతో లక్ష చదరపుటడుగుల విస్తీర్ణంలో చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో ఈ విస్తరణ పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2018లో శంకుస్థాపన చేశారు. వీటిలో తొలి దశ విస్తరణ పనులు 2021లోనే పూర్తి కావాల్సి ఉండగా, కొవిడ్ కారణంగా ఆలస్యమయ్యాయి. ఆ తర్వాత 2023లో ఈ నిర్మాణ పనులను పూర్తి చేయగా, ప్రధాని మోదీ, సీఎం స్టాలిన్ కలిసి కొత్త టెర్మినల్ ప్రారంభించారు. ఇపుడు రెండో దశ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు వచ్చే యేడాది మార్చి నెలాఖరునాటికి పూర్తవుతాయని భావిస్తున్నారు. ఈ రెండో దశ విస్తరణలో 8 ప్రవేశద్వారాలతో పాటు 60 చెక్ ఇన్ కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పది ఎక్స్‌రే స్కాన్‌లు, 9 రిమోట్ బోర్డింగ్ గేట్‌లు, 8 ఏరో బ్రిడ్జిలు ఇలా అత్యాధునిక సౌకర్యాలను కల్పించనున్నారు. చెన్నై ఎయిర్ పోర్టులో పీక్ అవర్స్‌లో ఒక గంట వ్యవధిలో 12 వేల మంది ప్రయాణికులు, 24 లేదా 25 విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. కొత్త టెర్మినల్స్ అందుబాటులోకి వస్తే ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఒక యేడాదిలో ఈ విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల సంఖ్య 3.5 కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం చెన్నై ఎయిర్‌పోర్టులో టెర్మినల్ 1, 2, 4లు అందుబాటులో ఉన్నాయి. మూడో టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రయాణికుల తాకిడి మరింతగా పెరిగే అవకాశం ఉందని ఎయిర్‌పోర్టు అధికారులు చెబుతున్నారు.

డయాబెటిస్ ఎక్స్‌లెన్స్ క్లబ్ ప్రారంభం



క్లబ్ ప్రారంభోత్సవ దృశ్యం

అడయార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్లెనెగ్లెస్ హాస్పిటల్ 'డయాబెటిస్ ఎక్స్‌లెన్స్ క్లబ్ ప్రారంభించింది. ఈ క్లబ్ ద్వారా సమగ్రమైన డయాబెటిస్ కేర్, విద్యతో పాటు రోగుల ఎంగేజ్‌మెంట్ అందించనుంది. ఈ క్లబ్‌ను ప్రముఖ సీనియర్ నటుడు ఎస్వీ శేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నై, హైదరాబాద్ నగరాల్లోని గ్లెనెగ్లెస్ హాస్పిటల్ ఇంటెర్నల్ మెడిసిన్ అండ్ డయాబెటీస్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అశ్విన్ కరుప్పన్, క్లస్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కె. నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్విన్ కరుప్పన్ మాట్లాడుతూ, 'ప్రస్తుతం 101 మిలియన్ల మందికిపైగా ప్రజలు మధుమేహంతోనూ, 136 మిలియన్ల మంది ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నారని తెలిపారు. పట్టణీకరణ, జీవనశైలిలో మార్పులు రావడం వంటి పలు కారణాల వల్ల చక్కెర వ్యాధి బారినపడే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. అయితే, చాలా మంది ఈ వ్యాధిని ఆరంభంలోనే గుర్తించలేకపోతున్నారని వెల్లడించారు.

మదురై ఎయిమ్స్
నమూనా విడుదల



ఎయిమ్స్ భవన సముదాయాల నమూనా చిత్రం

అడయార్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తోప్పూరులో నిర్మిస్తున్న అఖిల భారత వైద్య విజ్ఞాన మండలి (ఎయిమ్స్) - మదురై ఆస్పత్రి భవన సముదాయ నమూనా (డిజైన్)ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ వైద్య కాలేజీ, ఆస్పత్రిని కేంద్ర ప్రభుత్వం రూ.1977 కోట్లతో నిర్మిస్తుంది. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. రెండు దశలుగా చేపట్టే నిర్మాణ పనులు గత యేడాది మే నెలలో ప్రారంభించారు. తొలి దశలో ఆస్పత్రి భవన సముదాయం, హాస్టల్ కాంప్లెక్స్, గృహ సముదాయం, 750 సీటింగ్ కెపాసిటీతో కూడిన ఆడిటోరియం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ పనులన్నీ వచ్చే యేడాదిలోగా పూర్తి చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎయిమ్స్-మదురై భవన సముదాయం పూర్తి డిజైన్‌ను విడుదల చేశారు.

శ్రీసిటీలో షార్ 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్

శ్రీసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్రోకు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా శ్రీసిటీ, శ్రీహరికోటలోని షార్ ఆధ్వర్యంలో శ్రీసిటీలో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. శుక్ర, శనివారాల్లో సాగిన ప్రదర్శనలో ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, అకార్డ్ స్కూల్, చిన్మయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుంచి తాజా పురోగతి వరకు వివిధ ప్రయోగాలు, లాంచ్‌ప్యాడ్‌లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు, ఇండియన్ రీజనల్ సెన్సింగ్ అప్లికేషన్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. అవకాశం కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.


నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

రేపటి నుంచి ఆలిండియా
పోస్టల్ క్యారమ్ టోర్నీ

తిరుపతి(క్రీడలు), మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 7వరకు నుంచి తిరుపతిలో 27వ ఆలిండియా పోస్టల్ క్యారమ్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. స్థానిక ఇందిరా మైదానంలోని మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రా, తెలంగాణ, హర్యాన, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, రాజస్తాన్ రాష్ట్రాలకు చెందిన 105మంది తపాల ఉద్యోగులు ఈ పోటీల్లో తలపడనున్నారు.

తిరుచెందూరు తీరానికి
అరుదైన తాబేళ్ల కళేబరాలు

● కాలుష్యం, ప్లాస్టిక్ కారణమా?


తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం

చెన్నై, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుచెందూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చేరువగా ఉన్న సముద్రతీర ప్రాంతాల్లో కడలిజీవులు విగత జీవులై కొట్టుకురావడం పర్యావరణ ప్రేమికులు, అటవీ శాఖ అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రత్యేకించి 10 నుండి వంద కేజీల బరువున్న మత్స్య సంపదను కాపాడగల సత్తా ఉన్న కడలి తాబేళ్లు విగత జీవులై తీరానికి కొట్టుకొస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అధికమవుతున్న ఉష్ణోగ్రత, వాతావరణంలో కాలుష్యం, సముద్రంలో వేసే ప్లాస్టిక్ వస్తువుల వల్లే ఇలా తాబేళ్లు నిర్జీవంగా కొడ్డుకొస్తున్నాయని భావిస్తున్నారు. గత పది రోజుల్లో రాష్ట్ర సముద్రతీర ప్రాంతాల్లోనే అధికంగా కనిపించే 'ఆలివ్ రెడ్లీ' జాతికి చెందిన 14 తాబేళ్ల కళేబరాలు తీరానికి వచ్చాయి. దీనిపై మత్స్యశాఖ ఉన్నతాధికారులు, కడలి జీవుల పరిశోధకులు పలు రకాల పరిశోధన చేస్తున్నారు. తిరుచెందూరు తీరం వైపే కాకుండా రాష్ట్రంలో సముద్రతీరాల్లోనూ 'ఆలివ్‌రిడ్లీ' జాతి తాబేళ్లు నిర్జీవంగా కొట్టుకొసున్నట్టు గుర్తించారు. మత్య సంపదను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ జాతి తాబేళ్లను కాపాడాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ విషయమై అన్నామలై విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం గౌరవాచార్యులు కదిరేశన్ మాట్లాడుతూ సిరియాలో లభించే ఐదు రకాల తాబేళ్లు దక్షిణభారత దేశంలోని సముద్రతీరంలోనూ అధికంగాఉన్నాయని తెలిపారు. వీటిలో 'ఆలివ్ రెడ్‌లే' తాబేళ్లు అధికంగా కనిపిస్తాయన్నారు. ఈ జాతి తాబేళ్లకు మత్స్య సంపదను కాపాడగలిగే సామర్థ్యం ఉంటుందన్నారు. తాబేళ్లు సాధారణంగా నవంబర్ నెలాఖరు నుంచి ఏప్రిల్ వరకూ సంతానోత్పత్తి కోసం ఎక్కడైతే అనువైన ఇసుక ప్రాంతాలుంటాయో ఆయా తీర ప్రాంతాలకు గుడ్లు పెట్టేందుకు వస్తాయన్నారు. తీరంలోని అనువైన ప్రాంతంలో గుడ్లు పెట్టి, వాటిపై ఇసుక కప్పి సముద్రంలోకి వెళ్లి పోతాయన్నారు. ఆలివ్ రిడ్లే తాబేలు సుమారు వంద గుడ్లు పెడుతుందని, గుడ్లు పెట్టిన తర్వాత ఆ తాబేళ్లు బలహీనంగా మారుతాయన్నారు. ఆ పరిస్థితిలో సముద్రంలో తిరిగి వెళ్తున్న [illegible] బండ రాళ్లు తగటలమో లేక పడవ తగలటమో జరిగితే ప్రాణాలు కోల్పోతాయన్నారు.అందుకే తాబేళ్ల సంతానోత్పత్తి కాలం అంటే ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు జాలర్లు పడవల్లో చేపలవేటకు వెళ్లకుండా ఉండడం మంచిదన్నారు. ఇక సముద్రంలో పారవేసే ప్లాస్టిక్ సంచులను ఎరగా భావించి తాబేళ్లు వాటితిని కూడా ప్రాణాలు కోల్పోతున్నాయని ఇటీవలి పరిశోధనల్లో వెల్లడైందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రత, పర్యావరణంలో కాలుష్యం తదితర కారణాల వల్లే తాబేళ్ల ప్రాణాలు హరించుకుపోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 146 చోట్ల తాబేళ్ల గుడ్లు పొదిగే ప్రాంతాలను ఏర్పాటు చేయడానికి ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయని కదిరేశన్ తెలిపారు.

తాబేలు గుడ్లు


తిరుచెందూరు తీరానికి కొట్టుకువచ్చిన తాబేలు కళేబరాన్ని పరిశీలిస్తున్న భద్రతా సిబ్బంది